ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 29.0 | కనిష్ఠం : 20.0

ANDHRAJYOTHY

5



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

మంగళవారం 26 ఆగస్టు 2025

కుక్కలంటే మాకు ప్రాణం



- కన్న బిడ్డల్లాగా పెంచుకుంటాం
- పుట్టిన రోజులు, సీమంతాలు చేస్తాం
- నేడు జాతీయ కుక్కల దినోత్సవం

పెంచుకున్న వారికి నమ్మిన బంట్లు అవి... సొంత మనుషుల్లాగా ఇంట్లో కలిసిపోతాయి.. అలసిన మనసుకు సేద తీరుస్తాయి... ఒత్తిడిని దూరం చేస్తాయి.. విశ్వాసానికి మారు పేరుగా తోడుంటాయి... పెంపుడు జంతువుల్లో ప్రధానమైనవి కుక్కలు.. వీటికే జంతు ప్రేమికుల మొదటి ప్రాధాన్యం.. జాతీయ కుక్కల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

- వివరాలు 7లో..

సీమంతాలు, పుట్టిన రోజులు

పెంచుకుంటున్న కుక్కలను కుటుంబ సభ్యులుగా భావించి పుట్టిన రోజులు, సీమంతాలు చేస్తామని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేట కాలనీకి చెందిన మంతటి యాదయ్య తెలిపారు. మునిసిపల్ రిటైర్డ్ ఉద్యోగి అయిన ఆయనకు కుక్కలంటే చాలా ఇష్టం. గత ఏడాది షిజ్జు జాతి కుక్కపిల్లని హైదరాబాద్ నుంచి తెప్పించుకున్నారు. దాన్ని సొంత బిడ్డలాగా చూసుకుంటున్నారు. అది గర్భం దాల్చడంతో సీమంతం వేడుకను ఘనంగా నిర్వహించారు. తర్వాత పుట్టిన 5 పిల్లలకు పుట్టిన రోజు వేడుకలు కూడా చేశారు.

గ్రేట్ డేన్‌కు ప్రత్యేక గది



తాము పెంచుకుంటున్న గ్రేట్ డేన్ జాతి కుక్కకు ఇంట్లో ఓ ప్రత్యేక గదిని కేటాయించామని మహబూబ్‌నగర్ పట్టణంలోని సుశ్రుత ప్రజా వైద్యశాల ఎండీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దానికి అవసరమైన సేవలు చేసేందుకు ఒక మనిషిని కూడా నియమించుకున్నామని చెప్పారు. దాని పోషణకు ప్రతీ నెల రూ.25 వేల నుంచి రూ. 30 వేల వరకు ఖర్చు అవుతోంది. సోషలైజేషన్ కోసం హైదరాబాద్‌లో దానికి శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు.

మద్యం మత్తులో భార్యను చంపిన భర్త



బాలమణి (ఫైల్)

మిడ్జిల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న భర్త, భార్యను గొడ్డలితో దాడి చేసి హత్యచేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. భైరంపల్లి గ్రామానికి చెందిన బండారి బాలమణి (40)ని భర్త బండారి బుచ్చయ్య మధ్యాహ్నం 12 గంటల సమయంలో మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని కోరాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమెను నిద్రిస్తున్న సమయంలో మెడభాగాన గొడ్డలితో దాడిచేసి హత్యచేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

హత్య జరిగిన విషయం తెలుసుకున్న జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ క్లూస్ టీంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తాగుడు మానిపించేందుకు చెట్లమందు తాగించడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగినట్లు కొందరు గ్రామస్థులు తెలిపారు. కొన్ని నెలల క్రితం కుమారుడు గణేష్ అనారోగ్యంతో మృతి చెందగా అప్పటినుంచి బుచ్చయ్య తాగుడుకు బానిసైనట్లు తెలిపారు. కూతురికి వివాహం జరిగింది.

మృతురాలి కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెద్ద చెరువు ఎండుతోంది..!



తూము ద్వారా నీటిని వదులుతున్న దృశ్యం

- వచ్చిన నీరు వచ్చినట్లుగానే కిందికి
- తూము ద్వారా నీటిని బయటకు వదిలేస్తున్నారు
- భారీ వర్షాలు వస్తే లోతట్టు ప్రాంతం జలమయం అవుతుందని ముందస్తు చర్యలు
- వర్షాలు బంద్ అయినా నీటిని నిలుపడం లేదు

మహబూబ్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా జిల్లాలోని వాగులు పొంగి ప్రవహించగా, చెరువులు, కుంటలు ఇప్పటికీ అలుగులు పారుతున్నాయి.. పలు కుంటలు, చెరువులకు గండ్లు పడ్డాయి. జిల్లాలోని 17 మండలాల్లో సాధారణం కన్నా సగటున 90 శాతం అధిక వర్షపాతం నమోదైంది.. ఇలాంటి పరిస్థితులలో జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు ఎండుతోంది. చుట్టూ మట్టిదిబ్బలు తేలి నీటితో కళకళలాడాల్సిన చెరువు కళావిహీనంగా కనిపిస్తోంది.. పాలమూరు నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్ చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోట్లు ఖర్చు చేశారు. చెరువు నిండితే కింద ఉన్న లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతుంటాయి. ప్రతీ ఏటా వర్షాకాలంలో ఈ సమస్య ఉంటుంది. చెరువుకు రెండు వైపులా అలుగులు ఉన్నా పారితే ఆ నీరు వెళ్లడానికి అవసరమైన నాలాలను రెండువైపులా కబ్జాచేశారు. నాలాలు కాస్త పిల్లకాలువలుగా మారడంతో అలుగులు పారితే ఆ నీరు కాలువలు ఎక్కి ఇళ్లలోకి చేరుతాయి. దీని వల్ల లోతట్టు ప్రాంతాలైన రామయ్యబౌళి, బీకెరెడ్డికాలనీ, మధురానగర్, మైత్రీనగర్, శివశక్తినగర్‌లలో పలు ఇళ్లలోకి నీరు చేరడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతుంటారు.

అందుకే భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి అధికారులు ముందుగానే నీటిని కిందికి వదిలే ప్రక్రియ చేపట్టారు. ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ఈసారి ఎక్కడా చెరువు కింద ఉన్న లోతట్టు కాలనీలు ముంపునకు గురికాలేదు. ఇంతవరకు బాగానే ఉన్నా... చెరువు సగం మేర కూడా నీరు ఉంచకుండా జీరో చేయడం ఏంటన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● బోర్ల పరిస్థితేంటి?

ఈ చెరువు చుట్టుపక్కల ఉండే కాలనీలకు చెందిన నివాసాలలో వేల సంఖ్యలో బోర్లు ఉంటాయి. చెరువులో నీళ్ల లేకుంటే రామయ్యబౌళి, మైత్రీనగర్, బీకేరెడ్డికాలనీ, శేషాద్రినగర్, న్యూటౌన్, మోటార్‌లైన్, షాషాబ్‌గుట్ట ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదముందని, తద్వారా తమ ఇళ్లల్లో బోర్ల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని తూము బంద్ చేయాల్సిన అవసరం ఉంది. కనీసం ఎఫ్‌టీఎస్‌కు 50 శాతం మేర అయినా నీటిని నిలువ ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

వచ్చిన నీరు వచ్చినట్లే ...

చెరువులోకి వస్తున్న నీటిని వచ్చినవి వచ్చి నట్టే కిందికి వదులుతున్నారు. ప్రస్తుతం వర్షాలు ఆగి వారం రోజులవుతోంది. విపరీతంగా ఎండకాస్తోంది. ఇలాంటి పరిస్థితిలోనూ తూముకు అడ్డుకట్ట వేయకుండా నీటిని వదలడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాల సమయం లో లోతట్టు ముంపునకు కాకుండా చర్య లు తీసుకున్నారంటే అర్థముంది.కానీ వర్షాలు లేని సమయంలోనూ నీటి ని కిందికి ఎందుకు వదులుతున్నారో అర్థం కావడం లేదు. చెరువును జీరో చేయకుండా సగం వరకు నీటిని పెట్టి ఆపైన వచ్చే నీటిని బయటకు పంపిస్తే బాగుంటుంది. రామయ్యబౌళి, బీకేరెడ్డి కాలనీల వైపు అలుగుల నుంచి నీటిని పంపించేందుకు నాలాల నిర్మాణం కూడా చేపట్టారు. అయినా చెరువులో నీరు నిలువకుండా వదలడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షం నీటిని చెరువులో నింపుకోకుండా ఆ తరువాత నింపుకున్నా ప్రయోజనం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అడుగంటుతున్న మినీట్యాంక్‌బండ్(పెద్దచెరువు)



నిర్వాసితులకు త్వరలో ఇళ్ల స్థలాలు

- పట్టాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు 6



జడ్చర్ల మండలం దేవునిగుట్టతండా సమీపంలోని పునరావాస కేంద్రంలో ప్లాట్లను కేటాయించుకుంటున్న తుమ్మలకుంటతండా వాసులు (ఫైల్)

రైతులే ధర నిర్ణయించే రోజు కోసం పోరాడాలి

- మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్



మహబూబ్‌నగర్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, కూలీలు

పాలమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటకు ధర నిర్ణయించుకునే రోజులకోసం పోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్)రాష్ట్ర ప్రథమ మహాసభ, భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభను రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చెల రంగారెడ్డి ఆధ్యక్షతన ప్రారంభించారు.

ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ ఆగస్టు 15న మోదీ ఎర్రకోట నుంచి దేశ ప్రజలకు అండగా ఉంటానని మాట్లాడి, మరునాడే పత్తి మీద విదేశాలనుంచి దిగుమతి చేసుకునే సుంకాలు రద్దు చేశాడన్నారు. దానివల్ల మన పత్తి రేటు పడిపోయి విదేశాల పత్తిరేటు పెరిగిందన్నారు. ఫిబ్రవరిలో తెలంగాణకు పది లక్షల టన్నుల యూరియా ఇస్తామని ఆగస్టు వచ్చేసరికి మొత్తం కోతపెట్టి ఐదు లక్షల టన్నులు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. పాలకులు రైతులకు వ్యతిరేకంగా చట్టాలు తయారు చేయటం దారుణంగా ఉందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. రైతాంగం తీవ్రమైన దుర్భరమైన స్థితిలో ఉందని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పి.రంగరావు అన్నారు. సభలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు టి.దామోదరరావు, ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాము, సి.హెచ్ రాంచంద్, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.వెంకటేశ్, హన్మేష్, మహిళా సంఘం నాయకురాలు చంద్రఅరుణలు ప్రసంగించారు. సభలో అరుణోదయ కళాకారులు ప్రస్తుత రాజకీయాలు, పరిస్థితులపై పాటలు, నాటికల రూపంలో ప్రదర్శనలు చేపట్టారు. రైతుసంఘం, కార్మికసంఘం, విద్యార్థి, యువజనసంఘం నాయకులు సాంబశివుడు, కాశీనాథ్, యాదగిరి, రాజన్న, కొండారెడ్డి, వెంకటన్న, ఆర్.ఆర్ మణ్యం, రామకృష్ణ, అరుణ్‌కుమార్, బాలు, నరసింహ, సీతారం, మధు, శివకుమార్‌లు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కరువు

- తనిఖీలకు నోచుకోని పాఠశాలలు..?
- అమలు కాని విద్యాశాఖ నిబంధనలు
- డీఈవో, ఎంఈవోలు పాఠశాలలపై పర్యవేక్షణ అంతంతే
- కదలని కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు



షాషాబ్‌గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలపై పర్యవేక్షణ కరువవుతోంది. పాఠశాల విద్యాశాఖ ఆదేశాలున్నా సంబంధిత బాధ్యులు కొందరు తనిఖీలు చేయటం లేదని తెలుస్తోంది. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే బోధన, బోధనాభ్యసన కృత్యాలు ఉపయోగించి విద్యార్థులకు ఉపాధ్యాయుల బోధన చేస్తున్నారా...? విద్యార్థుల సామర్థ్యాలు..? ఎలా చదువుతున్నారు? అన్న అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించాలి. వారికి ప్రభుత్వం సూచించిన విధంగా బోధన అందుతుందా అన్న దానిని గుర్తించి విద్యాశాఖ ప్రతీ వారంలో రాష్ట్ర స్థాయి అధికారులు, డీఈవోలు, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు పాఠశాలను పర్యవేక్షించాలి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

కానీ ఇవేవీ క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. కాంప్లెక్స్ పాఠశాల హెడ్మాస్టర్ల నుంచి రాష్ట్ర స్థాయి అధికారులు కూడా ప్రతీ వారం పాఠశాలను తనిఖీ చేసి తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి దీన్ని అమలు చేయాలని విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. కానీ చాలావరకు మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాల పర్యవేక్షణ చేయడం లేదని తెలుస్తున్నది. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు వేలకు పైగా పాఠశాలలు ఉన్నాయి. అందులో 78 మండలాల్లో 215 కాంప్లెక్స్ పాఠశాలలు ఉన్నాయి.

● నిబంధనలిలా...

ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ తదిరత పాఠశాలలను రాష్ట్ర అధికారులు ప్రతీ నెల 8 పాఠశాలలు, ఆర్జేడీ పరిధిలోని 12 పాఠశాలలను,

- మిగతా 6లో..

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ విజయేందిరబోయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డెంగీ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి, ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలు, ఆరోగ్య శాఖ సమన్వయంతో పారిశుధ్య చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎ క్కువగా డెంగీ కేసులు నమోదు కాకుండా ప్రజలే తమ ఇంటి పరిస రాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి

- అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



పేట క్రీడా మైదానంలో విద్యార్థినులతో కలిసి ఖోఖో ఆడుతున్న ఎమ్మెల్యే

నారాయణపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మానసిక శారీరక దారుఢ్యం పెంచే క్రీడలు జీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేటలోని మినీస్టేడియంలో రూ.26. 60 లక్షలతో చేపట్టే గ్రౌండ్ లెవలింగ్, అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. నిర్మాణానికి సంబంధించిన నిధులను యూనియన్ బ్యాంక్ సౌజ న్యంతో సీఎస్ ఆర్ ఫండ్స్ నుంచి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణపేట క్రీడలకు, క్రీడాకారులకు నిలయమని అన్నారు. అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, సరాఫ్ నాగరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, రవీందర్‌రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేష్, పీడీ సాయినాథ్, బాల్‌రాజ్, అక్తర్ పాషా, రమణ, దత్తురావు తదితరులు ఉన్నారు.

ఖోఖో ఆడిన ఎమ్మెల్యే...

పేట క్రీడా మైదానంలో విద్యార్థినులతో కలిసి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఖోఖో ఆడారు. కాసేపు సరదాగా విద్యార్థులతో కలిసి ఖోఖో ఆడి ఎమ్మెల్యే విద్యార్థినుల్లో ఉత్సాహం నింపారు. ఆటలో క్రీడా స్ఫూర్తిని చాటిన ఎమ్మెల్యే చివరి వరకు అవుట్ కాకపోవడం గమనార్హం. అలాగే మండల స్థాయి పాఠశాలల క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే బ్యాట్ పట్టి ఆడి ప్రారంభించారు.

యూరియా కోసం తప్పని నిరీక్షణ

- పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరుతున్న రైతులు
- ఆత్మకూరు, కొత్తకోటలలో బీఆర్‌ఎస్ ధర్నా

7

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

- కిక్ బాక్సింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ 6

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- మహబూబ్‌నగర్ డీవైఎస్‌వో శ్రీనివాస్ 6

భార్య హత్య కేసులో భర్త రిమాండ్ 7

రూపాయి ఖర్చు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూపాయి ఖర్చులేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర పాడి పరిశ్రమ, డెయిరీ, క్రీడల, యువజన, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐదు గ్రామాలకు చెందిన 78మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించారు. నియోజకవర్గంలో రూ.175కోట్లతో 3800 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎవరూ రూపాయి ఖర్చులేకుండా ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. మండల పరిధిలోని జక్లేర్‌లో 19మంది, కాట్రేవ్‌పల్లిలో 26 మంది, ఖానాపూర్‌లో 12మంది, రుద్రసముద్రంలో 11మంది, పారేవులలో 10మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించారు. మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, పట్టణ అధ్యక్షులు రవికుమార్, విష్ణు, సలాంబిన్ ఉమర్, కట్ట వెంకటేష్, కోళ్ల వెంకటేష్, కావలి తాయప్ప, కల్లూరి గోవర్ధన్, గుంతలి రవి, కావలి ఆంజనేయులు, చెన్నయ్యగౌడ్, ఎంపీడీవో రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో ప్రతిష్ట నిలబెట్టాలి

క్రీడలతో యువత రాష్ట్ర ప్రతిష్ట నిలబెట్టాలని మంత్రి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్ల జానమ్మ ఆలయం నుంచి ప్రభుత్వ కళాశాల మైదానం వరకు జండా ఊపి 2కేరన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 31వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి, సీఐ రాంలాల్, ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అంబ్రేష్, రమేష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గణేష్‌కుమార్, కట్టసురేష్‌కుమార్, నాగిరెడ్డి, రంజిత్‌రెడ్డి, నర్సింహమూర్తి, నాగేష్‌లు పాల్గొన్నారు. కాగా, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ మక్తల్ పట్టణంలోని నదీనగర్, ఎల్‌బీ కాలనీ, ఆనంపల్లి వీధి ఆజాన్‌నగర్ వాసులు మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందించారు. ఆయా కాలనీవాసులు వల్లంపల్లి లక్ష్మణ్, సలాంబిన్ ఉమర్, బోయ రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు.. త్వరలో ఇళ్ల స్థలాలు

» పట్టాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించనున్న ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న తండాలు, ఊర్లకు చెందిన నిర్వాసితులకు త్వరలో ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేయనున్నారు. అందుకోసం అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, నవాబ్‌పేట మండలాల్లో దాదాపు 5,100 ఎకరాలకు పైచిలుకు పట్టా భూములతో పాటు, ప్రభుత్వ భూమిని సేకరించారు. రిజర్వాయర్ నిర్మాణంలో ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు తుమ్మలకుంటతండా, శ్యామగడ్డతండా, చిన్నగుట్ట తండా, ఒంటిగుడిసె తండా, రేగడిపట్టితండాలు ముంపునకు గురవుతున్నాయి. నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు అధికారులు జడ్చర్ల మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలో దాదాపు 300 ఎకరాల భూమిని సేకరించారు. పునరావాసం కింద పీడీఎఫ్ (ప్రాజెక్ట్ డిజాస్టర్ ఫ్యామిలీ) కింద ఒక్కో కుటుంబానికి 300 గజాల స్థలాన్ని కేటాయించనున్నారు. అందుకు సంబంధించిన లేఅవుట్‌ను ఇప్పటికే సిద్ధం చేసి, గ్రామాల వారీగా కేటాయించారు. పునరావాసం కేంద్రాల్లో వాటర్ ట్యాంకులు, డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్‌లైన్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, దేవాలయాలు, పార్థనా మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను నిర్మించాల్సి ఉంది.

తొలి విడతలో 338 మందికి పట్టాలు

రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న 5 తండాల చెందిన 338 మందికి పునరావాసం కింద ఇళ్ల పట్టాలను అందించనున్నారు. తొలి విడతలో తుమ్మల కుంటతండాకు చెందిన 104 మందికి, రేగటిపట్టితండాకు చెందిన 75 మందికి, చిన్నగుట్టతండాకు చెందిన 53 మందికి, ఒంటిగుడిసెల తండాకు చెందిన 11 మందికి, శ్యామగడ్డతండాకు చెందిన 95 మందికి పట్టాలను అందించనున్నారు. మలివిడతలో వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారు.

సొంతంగా ప్లాట్ల కేటాయింపు

ముంపు గ్రామమైన తుమ్మలకుంటావాసులు పునరావాస కేంద్రంలో ఇళ్ల పాట్లను సొంతంగా కేటాయించుకున్నారు. వారు స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్, ఆర్డీవోలకు సమాచారం అందించి విషయాన్ని తెలిపారు. గతనెల 25న తండావాసులందరూ ఏకమై చర్చించుకున్నారు. ఇళ్లస్థలాలను స్వచ్ఛందంగా కేటాయించుకున్నారు. మిగతా వారు కూడా ఇళ్ల స్థలాలను కేటాయించుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.



జడ్చర్ల మండలం దేవునిగుట్టతండా సమీపంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు లేఅవుట్ చేసిన ప్లాట్లు

పట్టాల పంపిణీకి ఏర్పాట్లు



ఉదండాపూర్ రిజర్వాయ ర్‌లో ముంపునకు గురైన తండావాసులకు మొదటి విడతగా ఇళ్ల స్థలం పట్టాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం. త్వరలోనే వారికి అందించనున్నాము. ఆ తర్వాత వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల నిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- నర్సింగ్‌రావు, జడ్చర్ల తహసీల్దార్

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

» కిక్ బాక్సింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్



జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అధ్యక్షుడు రవికుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నయ్‌లో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు జిల్లాకు చెందిన ఓంకార్, శివప్రసాద్, రేవంత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన వారిని అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» మహబూబ్‌నగర్ డీవైఎస్‌వో శ్రీనివాస్



విలువిద్యలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. ఇటీవల డిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి విలువిద్య పోటీల్లో జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు స్మృతి సన్నిభ బంగారు, కృతిక్ శ్రీవత్సవ్ వెండి, కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా సోమవారం క్రీడా శాఖ కార్యాలయంలో డీవైఎస్‌వో వారిని అభినందించారు. జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం

» అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీ టీషర్టులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. పాలమూరు యూనివర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌లో ఈ నెల 30, 31వ తేదీల్లో జి.రాజేంద్రప్రసాద్ స్మారక 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు సోమవారం సురేశ్‌బాబు క్రీడా దుస్తులను అందించారు. అనంతరం శరత్‌చంద్ర మాట్లాడుతూ టోర్నీలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 1,200 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శులు సీ. శ్రీనివాసులు, పి. శ్రీనివాసులు, కోచ్ సునీల్‌కుమార్, పీడీలు దత్తాత్రేయ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



నేషనల్ కరాటే టోర్నీలో పతకాలు సాధించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మహబూబ్‌నగర్ పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు 7 బంగారు. 2 రజత, 1 కాంస్య పతకాలను సాధించారని డ్రాగన్ షోటోకాన్ మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు ఎస్‌కే మోసిన్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కరస్పాండెంట్ రాఘవేందర్ అభినందించారు.

హెచ్‌సీఏ 2లీగ్‌లో రాణించిన జిల్లా క్రీడాకారులు

» తొలి ఇన్నింగ్స్‌లో 331 పరుగులకు ఆలౌట్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 2లీగ్ టోర్నీలో జిల్లా జట్టు క్రీడాకారులు రాణించారు. సోమవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ కేసీఆర్-2 క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 2డే క్రికెట్ లీగ్‌లో మహబూబ్‌నగర్ -ఖమ్మం జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 87.1 ఓవర్లలో 331 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అబ్దుల్ రాఫె 73, ఛత్రపతి 63, కేతన్‌కుమార్ 62 అర్ధసెంచరీతో రాణించారు. బ్యాటింగ్‌లో రాణించిన జిల్లా క్రీడాకారులు జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్ అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటితే రాష్ట్ర జట్టులో చోటు లభిస్తుందని క్రీడాకారులకు సూచించారు.



అర్ధసెంచరీతో రాణించిన అబ్దుల్‌రాఫె

దళిత ఉద్యోగులపై చిన్నచూపు

- ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్



విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన చేపట్టిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

పాలమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో దళిత ఉద్యోగులపై చిన్నచూపు ప్రదర్శించడాన్ని సహించబోమని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, టి.గంగాధర్, హుస్సేన్ హెచ్చరించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ సభ్యులు రికార్డు అసిస్టెంట్ పదోన్నతుల కోసం ఆరు నెలలుగా విన్నవిస్తున్నా, ఎస్ఈ పి.వెంకటరమేశ్ నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదే నిర్లక్ష్యాన్ని ఇతర సంఘాలపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడే దళిత ఉద్యోగులను మాత్రమే కారకులను చేస్తారా..? అని నిలదీశారు. నారాయణపేట జిల్లా ఏర్పాటై మూడేళ్లు అవుతున్నా, కేటాయించిన ఉద్యోగులను అక్కడికి పంపించకుండా, ఇక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా వేతనాలు ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఉన్నతాకాఆరులు మూడేళ్ల క్రితమే ఆదేశాలు జారీ చేసినా, ఎందుకు రిలీవ్ చేయడం లేదో ఎస్ఈ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ పోలీసు అధికారులు సీఐ మహేశ్వరరావు, ఎస్ఐ మదన్‌మోహన్, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌బాబు, కార్యదర్శి బీచుపల్లి, రఘునాథ్, రామకృష్ణ, తిరుపతయ్య, మహేశ్, గోవిందు, వెంకట్రాములు పాల్గొన్నారు.

విద్యారంగంపై కేంద్రం దాడి

» ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య

» ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి

» రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రజనీకాంత్ , నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య

కొల్లాపూర్ , ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక విద్యారంగంపై దాడి ప్రారంభించిందని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు శ్రీజన్ భట్టాచార్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటంలోని శ్రీవారి సముద్రం సమీపంలో ఉన్న ప్రైవేటు కాటేజీలో సోమవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి శ్రీజన్ భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగించి, స్వాతంత్ర్య ఉద్యమంలో ఎలాంటి పాత్రా లేని సావర్కర్ లాంటి వారి జీవిత చరిత్రను పొందు పరుస్తోందన్నారు. బీజేపీ నియంత పాలనను ప్రశ్నించినందుకు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ఫెలోషిప్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రజనీకాంత్, నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఇవ్వాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, పూజ, ప్రశాంత్, శంకర్, రాష్ట్ర సహ కార్యదర్శులు శ్రీకాంత్, ప్రశాంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ తారా సింగ్, జిల్లా కమిటీ సభ్యులు రామార్జున, చరణ్, కార్తీక్, చిన్న, కార్తీక్, హేమంత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఎలుకల బెడద

» కరవడంతో విద్యార్థులకు గాయాలు

» శాంతినగర్ ఎంజేపీలో ఘటన

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, శాంతినగర్ మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులను ఎలుకలు కరిచి గాయపరిచాయి. పాఠశాల రెండవ అంతస్తులో 8, 9వ తరగతులకు చెందిన విద్యార్థులు అక్కడే చదువుకుని, అక్కడే పడుకుంటారు. గత నాలుగైదు రోజులుగా రాత్రి వేళ నిద్రపోతున్న వారిని ఎలుకలు కరుస్తున్నాయి. దుప్పటి కప్పుకున్నా, అందులోకి దూరి చేతులు, కాళ్ల వేళ్లను కొరుకుతున్నాయి. దీంతో వారు భోజనం చేయలేకపోతున్నారు. నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్‌లోని పెట్టెల సందుల్లో ఎలుకలు ఆవాసాలు ఏర్పరుచుకొని, రాత్రి వేళ గదుల్లోకి వస్తున్నాయని వారు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఈ విషయాన్ని విద్యార్థులు కూడా తమ దృష్టికి తెచ్చారని ఆయన తెలిపారు.

రాబిట్ ప్యాడ్లు, బోన్లు ఏర్పాటు చేసి ఎలుకలను నియంత్రిస్తామని తెలిపారు.



ఎలుకలు కరవడంతో ఆసుపత్రికి వెళ్తున్న విద్యార్థులు

మట్టి 'కొట్టేస్తున్నారు'

» ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి అక్రమంగా తరలింపు

» గ్రామస్థులు అడ్డుకున్నా ఆగని దందా

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమార్కులు మట్టిని కూడా వదిలిపెట్టడం లేదు. కొందరు నాయకుల అండతో యథేచ్ఛగా మట్టిని తరలించుకుపోతున్నారు. వారికి కొందరు నాయకులు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ ప్రాంతం అందుకు వేదికగా మారింది. రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న ఉదండాపూర్, వల్లూరు గ్రామాల శివారులో ఎర్రమట్టి భూములు అధికంగా ఉన్నాయి. మట్టి వ్యాపారుల కన్ను ఆ భూములపై పడింది. దీంతో ఇప్పటికే వేలాది టిప్పర్ల మట్టిని కొట్టుకుపోయిన అక్రమార్కులు, మూడు ట్రాక్టర్లు... ఆరు టిప్పర్లు అన్న చందంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఉదండాపూర్, వల్లూరు గ్రామాల్లోని ప్రధాన రహదారుల గుండా టిప్పర్లలో మట్టిని తరలించుకుపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది టిప్పర్లు తిరుగుతుండటంతో రహదారులు దెబ్బతిన్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో దుమ్ము, ధూళితో అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నాయకులు వంత పాడుతున్నట్లు విమర్శలున్నాయి. వారి అండతోనే మట్టి దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను పట్టుకుని అధికారులకు అప్పగించినా, చర్యలు తీసుకోవడంలేదంటూ వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. టిప్పర్ పట్టుకుని అధికారులకు ఫోన్ చేసి చెప్పినా స్పందించడం లేదని చెప్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జడ్చర్ల మండలం ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్



టిప్పర్‌లో ఉన్న మట్టి

పర్యవేక్షణ.. కరువు

(5వ పేజీ తరువాయి)

డీఈవోలు 12 పాఠశాలలు, మండల పరిధిలోని ఎంఈవో 16 పాఠశాలలను, కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలోని 20 పాఠశాలలను తప్పని సరిగా పర్యవేక్షించాలి. పాఠశాల సమయంలో ఉన్న ఎనిమిది క్లాసులలో ఎప్పుడైనా పర్యవేక్షించవచ్చు. పాఠశాల రికార్డులు పరిశీలించాలి... విద్యార్థుల తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో కూర్చొని ఉపాధ్యాయులు బోధిస్తున్న విషయాలను వినాలి. పాఠ్యప్రణాళికను అనుసరించి బోధిస్తున్నడా లేదా అన్న అంశాలను పరిశీలించాలి. అక్కడ విన్న పాఠం విద్యార్థులకు అర్థం అయ్యేవిధంగా ఉందా... లేదా అన్న విషయాలను కూడా విద్యార్థులతో మాట్లాడాలి. తరగతి గదిలో విద్యార్థులతో గడిపిన సమయంలో ఎలాంటి విషయాలు గమనించారు? విద్యార్థుల బోధన ఎలా సాగుతున్నది అన్న విషయాలను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అక్కడికక్కడే నమోదు చేయాలి.

ఉమ్మడి జిల్లాలో 215 కాప్లెంక్స్ పాఠశాలలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 215 కాంప్లెక్స్ పాఠశాలలు ఉన్నాయి. ఆ పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయులు వారి కాంప్లెక్ పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేయాలి. కానీ పలు కారణాలు చూపుతూ అనుకున్న స్థాయిలో తనిఖీలు చేయడం లేదు. ఆ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు తనిఖీ చేసి అక్కడ వెళ్లిన సమయంలో తప్పనిసరిగా వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. కానీ ఈ పర్యవేక్షణ అంతంత మాత్రంగానే జరుగుతున్నది. అదేవిధంగా అన్ని మండలాల ఎంఈవోలు కూడా అనుకున్న విధంగా పాఠశాలలను పరిశీలించడం లేదు. ఇందులో ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు ఉండగా మిగతా వారంతా జీహెచ్‌ఎంలే ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. ఇటు ఎంఈవో బాధ్యతలు, హెచ్‌ఎం బాధ్యతలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బాధ్యతలు నిర్వహించాలంటే కొంత ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. మహబూబ్‌నగర్ 53, నాకర్‌కర్నూల్ 57, నారాయణపేట 35, వనపర్తి 25, జోగుళాంబ గద్వాల జిల్లాలో 45 కాంప్లెక్స్ పాఠశాలలు ఉన్నాయి.

పాఠశాలలపై పర్యవేక్షణ చేయాల్సిందే

అందరు ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖ సూచించిన విధంగా తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించాలి. ఎంఈవోలు కూడా నిబంధనల ప్రకారం తనిఖీలు చేయాలని గతంలోనే ఆదేశించాం. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయి.

- ప్రవీణ్‌కుమార్, డీఈవో, మహబూబ్‌నగర్

పదోన్నతుల వెబ్ ఆప్షన్ ఆలస్యం

» ఇబ్బందులు పడిన ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుల సర్వీస్‌బుక్‌లు పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ఉపాధ్యాయులు తమకున్న ఖాళీల్లో అనుకూలమైన పాఠశాల ఎంపిక చేసుకునేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచే వెబ్ ఆప్షన్ ఆవ్వాలని అధికారులు మొదట సూచించారు. కానీ ఉదయం నుంచి వెబ్ ఆప్షన్ ఇచ్చేందుకు చాలా మంది ఉపాధ్యాయులు ప్రయత్నించినా.. అసౌకర్యం కలగడంతో పదోన్నతుల జాబితాలో పేర్లు ఉన్న ఉపాధ్యాయులు ఇబ్బందిపడ్డారు. జిల్లా అధికారులకు ఫోన్ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అప్పుడు ఇప్పుడు వస్తాయంటూ సాయంత్రం వరకు చెప్పుకొచ్చారు. చివరికి రాత్రి 8 గంటల నుంచి పదోన్నతులకు సంబంధించి ఆప్షన్ ఇవ్వాలని సంబంధిత ఉపాధ్యాయుల ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. రాత్రి 12 గంటలలోపు ఈ ఆప్షన్ ఇచ్చేందు అవకాశం ఉందని అందులో పేర్కొన్నారు. తెల్లవారుజాము వరకు ఏదైన ఆప్షన్ తొలగించుకోవచ్చని ఆ తర్వాత అవకాశం ఉండదని విద్యాశాఖ అధికారులు సూచించారు. దీంతో రాత్రి 8 గంటల నుంచి సబ్జెక్టు వారీగా ఖాళీగా ఉన్న పాఠశాల వివరాలను ఆప్షన్ ఇచ్చారు. కాగా జిల్లాలో పోస్టులకు సంబంధించి తుది జాబితా సిద్ధం చేసి పాఠశాల విద్యాశాఖ అధికారులకు జిల్లా అధికారులు పంపించారు. అది ఫైనల్ కావడంతో సీనియార్టీ, రోస్టర్ పాయింట్ల ఆధారంగా కొన్ని సబ్జెక్టుల్లో చిన్న మార్పులు జరిగాయి. అయితే కొందరు ఉపాధ్యాయులు తోటి ఉపాధ్యాయులకు గత జాబితాలో తనపేరుపై ఉందని, ఇప్పుడు నీ పేరు పైకి ఎలా వచ్చిందని నీపై ఫిర్యాదు చేస్తామంటూ ఫోన్‌చేసి బెదిరించారు. మరి కొందరు ఫలానా ప్లేస్ నేను తీసుకుంటా.. నీవు ఆ ప్లేస్ ఆప్షన్ ఇవ్వద్దూ అంటూ చెప్పడం కలకలం రేపింది. ఈ విషయం డీఈవో వరకు వెళ్లింది. జిల్లా మొత్తం 167 పోస్టులు పదోన్నతులకు నోటిఫై చేయగా అందులో 110 పోస్టులకు మాత్రమే పదోన్నతుల పొందనున్నట్లు సూపరింటెండెంట్ శంభుప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించి పదోన్నతుల ఉత్తర్వులు మంగళవారం సాయంత్రంలోపు రానున్నట్లు తెలిపారు.

పెద్దపులి స్వేచ్ఛా విహారం

- నల్లమలలోని నవాబ్ బంగ్లా వద్ద దర్శనం

మన్ననూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో సోమవారం ఓ పెద్దపులి స్వేచ్ఛగా విహరిస్తూ అటవీశాఖ అధికారుల కంట పడింది. విధుల్లో భాగంగా మన్ననూరు అటవీ రేంజ్ అధికారి వీరేశ్, అధికారులు, సిబ్బందితో కలిసి పర్హాబాద్ చౌరస్తా నుంచి అడవిలోకి వెళ్తుండగా నిజాం నవాబు బంగ్లా (షికారీ ఘర్) ప్రాంతంలో పెద్దపులి రోడ్డు దాటుతూ కనిపించింది. దీంతో వారు సెల్‌ఫోన్లలో వీడియోలు తీశారు. ప్రస్తుతం వన్యప్రాణుల సంతానోత్పత్తి సమయం కావడంతో సెప్టెంబర్ 30 వరకు సఫారీ టూర్‌ను రద్దు చేశారు. దీంతో పెద్దపులులు అడవిలో స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాజాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామంలోని సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన అంజాద్ ఖాన్ (35) మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ముదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జహీర బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మూడావత్ స్వాములు (ఫైల్)

అచ్చంపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలంలోని బొల్లట్‌పల్లి గ్రామంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన మూడావత్ స్వాములు (60) ఆదివారం రాత్రి పొలానికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూశారు. అక్కడ స్వాములు విద్యుదాఘాతంతో మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఇందిర తెలిపారు.

మద్యానికి బానిసై కర్ణాటక వాసి మృతి

నారాయణపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై నారాయణపేట జిల్లాలోని పాత గంజ్ ప్రాంతంలో నివాసముంటున్న కర్ణాటక రాష్ట్రం నసలవాయి గ్రామానికి చెందిన గొడుగు శివ(38) సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గొడుగు శివ హైదరాబాద్‌లో కొంతకాలంగా హోటల్‌లో పని చేస్తూ నాలుగు రోజుల క్రితం నసలవాయి గ్రామానికి వచ్చాడు. ఈనెల 20న గ్రామం నుంచి పేటకు వచ్చి గ్రామానికి తిరిగి రాలేదని భార్య రాధమ్మ తెలిపింది. తాగుడుకు బానిసైన శివ పాతగంజ్ వద్ద మృతిచెంది కన్పించాడని ఆ గ్రామానికి చెందిన జగ్గప్ప తమకు తెలిపినట్లు ఎస్‌ఐ వివరించారు. కొంతకాలంగా తాగుడుకు బానిసై భోజనం చేయక, నీరు సైతం తాగక గొంతు ఎండిపోయి మృతి చెందినట్లు భార్య రాధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మరికల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను నారాయణపేట జిల్లా ధన్వాడ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం తెల్లవారుజామున కొండాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల చౌరస్తాలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ధన్వాడ పోలీసు సిబ్బంది తిరుమలేష్‌గౌడ్, తిరుపతిరెడ్డి ఆపి తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ డ్రైవర్ పసుల నారాయణ, యజమాని ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్

మహబూబ్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : భార్య హత్య కేసులో భర్తను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉంటున్న శ్రావణి (27)ని ఈనెల 21న భర్త శ్రీశైలం సోమశిలకు వెళ్దామని తీసుకెళ్లాడు. పథకం ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని సాతాపూర్ అడవిలోకి తీసుకెళ్ళి కత్తితో పొడిచి చంపి, పెట్రోల్ పోసి తగులపెట్టాడు. ఆదివారం రాత్రి నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భార్యపై అనుమానంతో చంపినట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో టూటౌన్ పోలీసులు సోమవారం అతడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్ నిమిత్తం జిల్లా జైలుకు తరలించారు. తల్లి హత్యకు గురికావడం, తండ్రి జైలుకు వెళ్లడంతో వారి ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారు.

కొనసాగుతున్న డిగ్రీ, పీజీ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని పీజీ, బీఎడ్, బీపీఎడ్ నాల్గవ సెమిస్టర్, డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీడీసీ కాలేజీలోని పరీక్ష కేంద్రాలను పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ తనిఖీ చేసి, కాపియింగ్ పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిట్టింగ్ స్క్వాడ్స్ రంగప్ప, డాక్టర్ వేణు, ప్రిన్సిపాల్ కుమారస్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడం సరికాదు

» ఐజీపీని కలిసిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : హుందాగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలపై కక్షపూరిత కేసులు పెట్టడం అమానుషమని మాజీ మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఐజీపీ తఫ్సీర్ ఇక్బాల్‌ను కలిసి, మాట్లాడారు. అధికారం ఉందని చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలను లొంగదీసుకోవాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు కేసులు పెట్టి అరెస్టులు చేయించడం దారుణం అన్నారు. బీఆర్ఎస్ దేవరకద్ర మండలాధ్యక్షుడు జెట్టి నర్సిహ్మారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయించడం సమజసం కాదని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

» కలెక్టరేట్ ముందు బాధితుడి ఆందోళన


తమ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేసిన వారిని శిక్షించాలని కోరుతున్న పెద్ద బుచ్చన్న

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నా కుటుంబాన్ని కుల, గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చట్టపరమైన తీసుకోవాలని కోరుతూ జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలంలోని కుర్విరావుల్‌చెర్వు గ్రామానికి చెందిన పెద్దబుచ్చన్న కోరాడు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ మాజీ సర్పంచు జయమ్మ, ఆమె భర్త లక్ష్మన్న, కుమారుడు తిమ్మప్ప తన కుటుంబాన్ని కుల, గ్రామ బహిష్కరణ చేశారన్నారు. తమ ఇంటి పక్కనున్న ఖాళీ స్థలాన్ని ఇవ్వకపోవడంతో కక్ష్య సాధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. చర్చి సంఘం పెద్దలు కూడా తమను బహిష్కరించారని తెలిపారు. దీంతో మూడేళ్ల క్రితం నా మనుమరాలు చనిపోయినా అంత్యక్రియలు చేసేందుకు పాస్టర్ రాలేదన్నాడు. తన కుమార్తె వివాహానికి ఇంటింటికి వెళ్లి పిలిచినా ఎవరూ రాలేదని, పాస్టర్ కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి పెళ్లి చేశామని తెలిపారు. తమపై ఇంత దారుణంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుక్కలంటే మాకు ప్రాణం



» కన్న బిడ్డల్లాగా పెంచుకుంటాం
» పుట్టిన రోజులు, సీమంతాలు చేస్తాం
» ఖరీదైన ఆహారం పెడతాం
» అంటున్న యజమానులు

● నేడు జాతీయ కుక్కల దినోత్సవం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం)/ అచ్చంపేట/ కోడేరు/ పెద్దకొత్తపల్లి/ నారాయణపేట/ కల్వకుర్తి/కందనూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కుక్కలంటే తమకు ప్రాణమని, కన్న బిడ్డల్లాగా చూసుకుంటామని పెంపకందారులు చెప్తున్నారు. వేలు, లక్షల రూపాయలు పెట్టి జాతి కుక్కలను కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యేక ఆహారం అందిస్తూ, వసతులు కల్పిస్తూ జాగ్రత్తగా పెంచుకుంటున్నారు.

వాటిని కుటుంబ సభ్యులుగా భావించి పుట్టిన రోజులు, సీమంతం వేడుకలను నిర్వహిస్తున్నారు. నేడు జాతీయ కుక్కల దినోత్సవం సందర్భంగా కొందరు కుక్కల పెంపకందారులతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. వారు పెంచుకుంటున్న కుక్కల ప్రత్యేకతలు, వాటితో అనుబంధం తదితర అంశాలపై ప్రత్యేక కథనం..



డాబర్‌మాన్‌తో ఇంటికి రక్షణ

తాము పెంచుకుంటున్న డాబర్‌మాన్ ఇంటికి రక్షణగా ఉంటోందని నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల కేంద్రానికి చెందిన డి.బాలకృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో ఒక మగ, ఒక ఆడ డాబర్‌మాన్ కుక్కలను రూ.36 వేలకు కొనుగోలు చేశానని అన్నారు. ఇందులో ఆడ కుక్క చనిపోగా, మగ కుక్క ఉందని తెలిపారు. ప్రతీ రోజు 50 గ్రాముల పెడిగ్రీ, అడల్ట్ ఆహారం ఇస్తున్నట్లు చెప్పారు. ఇది కొత్తవారిని ఇంటి దరిదాపులకు కూడా రానివ్వదని చెప్పారు. ఇది మా ఇంట్లో ఉండటం వల్ల భయం లేకుండా జీవిస్తున్నామని తెలిపారు.

- బాలకృష్ణ, కోడేరు



జంట కుక్కలు సింబి, సింబా

నారాయణపేటకు చెందిన హనుమాన్‌ధరక్ జర్మన్ షెపర్డ్ జాతికి చెందిన జంట కుక్కలను పెంచుతున్నారు. వాటిని 2021లో హైదరాబాద్ నుంచి తెచ్చుకున్న అతడు సింబా, సింబి అని పేరు పెట్టారు. వాటికి ఉదయం, రాత్రి పెరుగు అన్నంతో పాటు డాగ్ ఫుడ్ అందిస్తున్నారు. ప్రతీ రోజు మూడు పూటలా వాకింగ్‌కు తీసుకెళ్తారు. ప్రతీ సంవత్సరం పుట్టిన రోజు వేడుకలను కూడా ఘనంగా చేస్తున్నారు.

- హనుమాన్‌ధరక్, నారాయణపేట



కన్న పిల్లల్లా చూసుకుంటాం

కుక్కలను తాము కన్న పిల్లల్లా చూసుకుంటామని నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలం చెర్లతిర్మలాపూర్ మాజీ సర్పంచు ముచ్చునూరు రవీందర్ గౌడ్ తెలిపారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నివసిస్తున్న ఆయన రెండు కుక్కలు ప్రేమగా పెంచుకుంటున్నారు. వాటికి ప్రతీరోజు వాటికి ఉదయం పాలు, బిస్కెట్, మధ్యాహ్నం అన్నం, చికెన్, రాత్రికి గుడ్లు, పాలు ఇస్తాను. అందుకు ప్రతీ నెల రూ. 3 వేల వరకు ఖర్చు అవుతుంది. ముందు వాటికి తినిపించిన తర్వాతే మేము భోజనం చేస్తాం.

- ముచ్చునూరు రవీందర్, చెర్లతిర్మలాపూర్

వీధి కుక్కలకు ప్రతీ రోజు ఆహారం



మహబూబ్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన శ్వేతా సింగ్ దంపతులకు కుక్కలంటే చాలా ప్రేమ. వారికి పిల్లలు లేకపోవడంతో మూగ జీవాలనే తమ పిల్లలుగా భావిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వీధికుక్కలకు ఆహారం ఇస్తున్నారు. ఎక్కడైనా కుక్కలు అనారోగ్యంతో, చర్మవ్యాధుల బారిన పడితే వాటిని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. చిన్న కుక్క పిల్లలు కనిపిస్తే ఇంటికి తీసుకెళ్తున్నారు. వాటిని పెంచి పెద్ద చేసి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించి వదిలేస్తున్నారు. అందుకోసం వారు తమ జీతంలో సగం వ రకు ఖర్చు చేస్తున్నారు.

- శ్వేతా సింగ్ దంపతులు

13 ఏళ్లుగా కుక్కల పెంపకం

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లికి చెందిన వికాస్ 13 సంవత్సరాల నుంచి వివిధ జాతుల కుక్కలను పెంచుతున్నాడు. ఆసక్తి ఉన్న వారికి విక్రయిస్తున్నాడు. పాలమూరులో 2021లో నిర్వహించిన డాగ్‌షోలో అతడి పెంపుడు కుక్క రుద్ర రెండవ బహుమతి సాధించింది. ప్రస్తుతం అతడి వద్ద బెల్జియం మాలినోయిస్, జర్మన్ షెపర్డ్, హస్కీ, రాట్‌విల్లర్, సిజ్జు, లాబ్రడార్ జాతుల కుక్కలున్నాయి.



ఒత్తిడి దూరం చేసే సిస్కో, చిచ్చు



సిస్కో, చిచ్చులు తమను ఒత్తిడి నుంచి దూరం చేస్తాయని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన అమర్‌నాథ్, లక్ష్మీ తెలిపారు. వారు 2015లో రూ.14 వేలు ఖర్చు చేసి ల్యాబ్రడార్ జాతికి చెందిన రెండు కుక్కలు తెచ్చుకున్నారు. వాటికి సిస్కో, చిచ్చు అని పేరు పెట్టి పెంచుకుంటున్నారు. వాటితో పాటు నేపాల్ బ్రీడ్ కుక్కను కూడా పెంచు కుంటున్నారు.



అవి ఎక్కడికి వెళ్లినా మా వెంటే ఉంటాయి. వాటి పోషణకు ప్రతీ నెల రూ.15 నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు అవుతోంది.

- అమర్‌నాథ్, కల్వకుర్తి

చిన్నా, పెద్ద తేడాలేని వ్యవస్థ కావాలి

» మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య
» రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవ చేసిన వ్యక్తి గుమ్మడి
» ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి



గుమ్మడి నరసయ్యకు పురస్కారం అందజేస్తున్న జేపీఎన్‌సీఈ కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో చిన్నా, పెద్ద అనే పెద్దలనే తేడాలేని వ్యవస్థ కావాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జయప్రకాష్ నారాయణ పురస్కారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లెందు మాజీ ఎమ్మెల్యేగా ఐదు సార్లు ఎన్నికై, సాదాసీదా జీవితం గడుపుతున్న గుమ్మడి నరసయ్యకు జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్ రూ.లక్ష నగదుతో పాటు పురస్కారం, మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు ప్రముఖ సినీ రచయిత నటుడు తనికెళ్ల భరణి, గుమ్మడి నరసయ్య, కళాశాల చైర్మన్ రవికుమార్ లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, జైపాల్‌రెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఆదర్శవంతులుగా ఉండాలన్నారు. ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవ వ్యక్తి గుమ్మడి నరసయ్య అన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకుడు కిల్లె గోపాల్, ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి, హన్మేష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటేష్, కళాశాల కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఈవీ చంద్రశేఖర్, పరీక్ష విభాగం అధికారి సందీప్‌కుమార్, వజ్రలింగం పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని నిరీక్షణ

» పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరుతున్న రైతులు
» ఆత్మకూరు, కొత్తకోటలలో బీఆర్ఎస్ ధర్నా


కొత్తకోట చౌరస్తాలో యూరియా కోసం ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఆత్మకూరు/ కొత్తకోట/ గట్టు/ భూత్పూర్/ గోపాల్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పొలం పనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు యూరియా కోసం కష్టాలు పడుతున్నారు. ప్రాథమిక సహకార కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. తమ వంతు కోసం నిరీక్షిస్తున్నారు. ఈ విషయంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు, కొత్తకోట మండల కేంద్రాల్లో సోమవారం రైతులు ధర్నా చేశారు.

● ఆత్మకూరులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులకు పదుల సంఖ్యలో యూరియా బస్తాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సింగిల్ విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, వ్యవసాయ అధికారి వినయ్ కుమార్‌లను ప్రశ్నించారు. రైతులందరికీ సమానంగా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు జానకిరామ్, చెన్నయ్య, రామకృష్ణ, గడ్డమీద శ్రీనివాసులు, ఆంజనేయులు, మాసన్న, భరత్‌రెడ్డి, భీమన్న, రాజారెడ్డి పాల్గొన్నారు.

● కొత్తకోట పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి ధర్నా చేశారు. కార్యాలయ ఇన్‌చార్జి శివాచారికి వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో వామన్‌గౌడ్, విశ్వేశ్వర్, చెన్నకేశవరెడ్డి, బాబురెడ్డి, కొండారెడ్డి, శ్రీనువాసులు, గోవిందు, ప్రశాంత్, మల్లేష్, రవీందర్‌రెడ్డి, రాములు యాదవ్, ఖాజామైనోద్దీన్, శ్రీనివాస్‌జీ, లక్ష్మణ్ నాయక్, గోపాల్ నాయక్, రాజు, వినోద్ సాగర్, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

ముందు రోజే క్యూ

జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయానికి మంగళవారం 450 బస్తాల యూరియా రానున్నది. విషయం తెలుసుకున్న రైతులు సోమవారం ఉదయమే కేంద్రం వద్దకు చేరుకున్నారు. తమ పాసు బుక్కులను, ఆధార్‌కార్డులను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి క్యూ లైనులో ఉంచారు.

ఉదయం 6 గంటల నుంచే..

మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ డీలర్ దుకాణం ముందు రైతులు ఉదయం 6 గంటల నుంచే అధిక సంఖ్యలో బారులు తీరారు. 10 గంటల సమయంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో యూరియా బస్తాల పంపిణీ ప్రారంభించారు. మండలానికి దాదాపు 14 వందల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 750 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు ఏవో మురళీధర్ తెలిపారు. రెండు, మూడు రోజుల్లో 200 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని చెప్పారు.

● వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రం వద్ద రైతులు ఉదయం 6 గంటల నుంచే బారులు తీరారు. తమ వంతు కోసం గంటల తరబడి ఎదురు చూశారు. ఒక దశలో తోపులాట జరగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. రైతులను శాంతింప చేసి క్రమ పద్ధతిలో యూరియా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నారు. మంగళ, బుధ వారాల్లో మళ్లీ యూరియా వస్తుందని ఏవో కరుణశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట మండల నాయకులు మణ్యం. చంద్రశేఖర్, మతీన్, గోపాల్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా తగ్గిన వరద

» 3.58 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా తగ్గిపోయింది. కర్ణాటకలో వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణాకు వరద తగ్గింది. సోమవారం ప్రాజెక్టులోకి 3.58 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు అధికారులు 7 గేట్లను 10 ఫీట్ల ఎత్తు ఎత్తి 1,87,208 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 62,162 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 198.36 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.50 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.51 లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నదిపై ఉన్న సన్నతి బ్యారేజీ నుంచి 1.85 లక్షల క్యూసెక్కులను జూరాలకు విడుదల చేశారు. ప్రస్తుతం జూరాలకు 2.95 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 26 గేట్లను ఎత్తి 2,69,917 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 9 వేల క్యూసెక్కులను శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల భూములు రక్షించాలి

» ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా


స్వామి వివేకానంద చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మక్తల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాల భూములు రక్షించి, కళాశాల తరలింపు ఆలోచన మానుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పరిషత్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి స్వామి వివేకానంద చౌరస్తా వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్‌తేజ, పట్టణ అధ్యక్షుడు అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. కలెక్టర్, మంత్రికి విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. మినీ స్టేడియం కోసం భవనాలు కూల్చడం వల్ల సుమారు రూ.15కోట్ల ప్రజా ధనం వృథా అవుతోందన్నారు. కళాశాలను అక్కడే ఉంచి వేరే ప్రదేశంలో స్టేడియం నిర్మించాలన్నారు. కళాశాలకు కొత్త భవనం నిర్మించాలన్నారు. ఇంటర్ బోర్డు పరిధిలో ఉన్న కళాశాలను కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కబ్జాకు గురికాకుండా కంచె వేయాలన్నారు. కళాశాల భవనం తరలిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వినయ్, నరేష్, ఇందు, విజయలక్ష్మీ, అభి, ఆనంద్, శివ, రంజిత్, సాయి, నవీన్, నాని, మీనాక్షి, అక్షర, నవిత, వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు.

సీవోఈ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మైనార్టీ గురుకులాల కళాశాలల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా మైనార్టీ గురుకులాల రీజినల్ లెవెల్ కో ఆర్డీనేటర్ ఖాజా బహోద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా లోని మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కళాశాలలో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని, 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల మూసివేత


ఫస్ట్‌ఎడ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

మహమ్మదాబాద్ ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లను సోమవారం జిల్లా మాస్ మీడియా అధికారిని మంజుల సీజ్ చేశారు. మండల కేంద్రంలోని సత్యనాయణరెడ్డి, రహీం, శ్రీనివాసులు, బాల్‌రెడ్డికి సంబంధించిన ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను సీజ్ చేశారు.

న్యూస్ బాక్స్

రేషన్ కార్డుల పంపిణీ

రాజాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈద్గాన్‌పల్లిలో సోమవారం లబ్ధిదారులకు మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ గౌడ్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. డైరెక్టర్ పంచాక్షరి, శ్రీనివాస్‌నాయక్, నరహరి, వెంకటేశ్వర్‌రెడ్డి, జంగయ్య, శివకుమార్, శేఖర్, పాల్గొన్నారు.

మన్యంకొండలో తనికెళ్ల భరణి పూజలు

మహబూబ్‌నగర్ రూరల్/టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మన్యంకొండ శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామితో పాటు జిల్లా కేంద్రంలోని అంబాభవానీ ఆలయంలో సినీ నటుడు, తనికెళ్ల భరణి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్యంకొండ ఆలయ ధర్మకర్త అలహరి మధుసూదన్‌కుమార్ తనికెళ్ల భరణిని సన్మానించారు. అంతకు ముందు ఆలయ చరిత్రను వివరించారు.

చెట్లు నరికివేతపై కేసు

నవాబ్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అకారణంగా దూషిస్తూ ఇంటిముందున్న చెట్లను నరికిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని కాకర్జాల గ్రామానికి చెందిన అనీల్‌కుమార్ ఇంటిముందున్న చెట్లను ఈనెల 22న గ్రామానికి చెందిన రాము, జ్యోతి, నర్సమ్మ నరికివేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కృష్ణుడి సూక్తులు పాటిద్దాం

నవాబ్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణుడి సూక్తులు ప్రతీ ఒక్కరు పాటించి సన్మార్గంలో నడవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక నిర్వాహకులు, ఎంఈవో నాగ్యనాయక్ అన్నారు. మండలంలోని కొల్లూర్, చౌడూర్ గ్రామాల్లో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

గండీడ్, (మహమ్మదాబాద్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటలకు నానో యూరియా వాడకం వల్ల అధిక దిగుబడి వస్తుందని ఏవో నరేందర్ అన్నారు. సోమవారం గండీడ్‌లో రైతులు రామయ్య, మల్లేశ్ పొలంలో నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ

కోయిలకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆదిఆంజనేయ స్వామి ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ కోయిలకొండ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మట్టి వినాయక ఉచితంగా పంపిణీ చేశారు. మంగళవారం కూడా మట్టి వినాయకులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ సర్పంచ్ కృష్ణయ్య, శాఖ స్వయం సేవకులు మోహన్, శంకర్, శ్రీకాంత్, రవికాంత్, వెంకట్, సత్యం, శివనందు, రాజు, నాగేష్, సత్తయ్య, నర్సిములు, రమేష్, భరత్, రఘుగౌడ్ పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ టౌన్ : కలం స్నేహం, సంగీత, సాహిత్య, సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాల్ ఆచార్య ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు మేకల అనురాధ ప్రసాద్ సోమవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

రేపు కనకాచారి వర్ధంతి సభ

పాలమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కెకె మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కె.కనకాచారి 20వ వర్ధంతిని జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు కెకె మిత్రులు కె.వామన్‌కుమార్, డి.నరసయ్య, కె.భీమయ్య, యం.రాఘవాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరికీ కూడు, గూడు, గుడ్డ, ఉపాధి లభించాలనే కనకాచారి తాపత్రయం పడిన వ్యక్తి అన్నారు. 1982లో ఉపాధ్యాయవృత్తి చేపట్టిన ఆయన డీటీఎఫ్ సంఘం పెట్టి అభివృద్ధి చేశారన్నారు. స్మారకసభకు ప్రజాస్వామికవాదులు, అభ్యుదయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యా ప్రమాణాలు పెంచడమే టీఎల్‌ఎం లక్ష్యం

నవాబ్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే టీఎల్‌ఎం లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ హరలింగం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టీఎల్‌ఎం మేళా కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, పీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో జయరాములు, ఎంఈవో నాగ్యనాయక్, జీహెచ్‌ఎం దశరథ్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశ్రమల సొమ్ము దోచుకుంటున్నారు

రాజాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి పేరుతో పరిశ్రమల నుంచి వస్తున్న సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) సొమ్మును స్థానిక నాయకులు దోచుకుంటున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ పోలేపల్లి సేజ్‌లోని పలు పరిశ్రమల నుంచి వస్తున్న సీఎస్‌ఆర్ ఫండ్, రాజాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చేస్తున్న ప్రోత్సాహం అంతంత మాత్రంగానే అందుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. సూరిబాబుగౌడ్, ఆనంద్, రాజు, శేఖర్, ఆదిత్య, బుగ్గయ్య, భీమయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి

» కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 86 ఫిర్యాదులు రాగా కలెక్టర్ స్వీకరించి, మాట్లాడారు. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, ఆర్డీవో నవీన్, డీఆర్డీవో నర్సింహులు పాల్గొన్నారు.

కమీషన్ డబ్బులు విడుదల చేయాలి..

జిల్లాలోని రేషన్ డీలర్లకు ఏప్రిల్ 2024కు సంబంధించిన కమీషన్ విడుదల చేయాలని జిల్లా చౌకధర దుకాణాదారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్యాసుందర్‌యాదవ్, జానకిరాములు, అన్వర్‌పాష ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

నష్టపరిహారం ఇవ్వాలి..

ఎనుగొండ బైపాస్ రోడ్డులో సర్వే నెం.19లో గల రిజిస్టర్ ప్లాట్లు కోల్పోయిన వారికి జనరల్ అవార్డు కింద నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ బాధితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 17 ప్లాట్లు కోల్పోయినట్లు వినతిలో పేర్కొన్నారు. భగవంత్‌రెడ్డి, ధామోదర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ తదితరులు వినతి పత్రం అందజేశారు.

కలెక్టరేట్‌లో మట్టి వినాయకుల పంపిణీ

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో వినాయక చవితి చవితి సందర్భంగా సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు, ఉద్యోగులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్ల పని చేయడం లేదని, పారితోషికాలు తగ్గించాలనే వ్యతిరేక విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కేంద్రం పెంచిన పారితోషికాల చెల్లింపు, ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు పరిష్కరించానలి ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లనాయక్, కార్యదర్శి కురుమూర్తి, రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి..



కలెక్టరేట్ ఎదుట సీపీఎం నాయకుల ధర్నా

ఇళ్లస్థలాలు కోల్పోయిన ప్రతీ పేదవారికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని, స్థలం లేని ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీపీఎం రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మి, పట్టణ కార్యదర్శి చంద్రకాంత్, కమిటీ సభ్యులు మోహన్, రాజకుమార్, విష్ణు, ఖమర్‌అలీ, నవాబ్‌ఖాన్ ఉన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ద్వారా స్వయం సహాయక బేకరిలో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయి సర్టిఫికెట్లు అందజేశారు. బిస్కెట్‌లు, కేకులు తదితర 16 రకాల వాటిలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా వారు తయారు చేసిన కేక్‌ను కలెక్టర్ కట్ చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అదనపు పీడీ శారద, డీపీఎం రాములు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ రూపురేఖలు మారుస్తా : ఎమ్మెల్యే



సర్వీస్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పడిన దేవరకద్ర మునిసిపాలిటీ రూపురేఖలను ఆరు నెలల్లో మారుస్తానని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహబూబ్‌నగర్ - రాయచూరు సర్వీర్ రోడ్డుకు శంకుస్థాపన చేసి, మాట్లాడారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి కావడంతో అటూ ఇటూ సర్వీస్ రోడ్డు లేక వాహనదారులు ఇబ్బందులు పడటంతో రూ.1.10 కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కథలప్ప, దేవస్థాన చైర్మన్ నరసింహరెడ్డి, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఫారుక్‌అలీ, నాయకులు గోర్ధన్‌రెడ్డి, రాంపాండు, శ్రీను, అంజన్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్, బాలస్వామి, శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

పాలమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ మహబూబ్‌నగర్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బాలస్వామి, అధ్యక్షుడిగా పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి, కోశాధికారిగా అంజిలయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రహమాన్, ఉపాధ్యక్షులుగా వీరేందర్‌జీ, వీణాదేవి, కార్యదర్శులుగా ఖాజమ్మ, తులయ్యచారి, బాలశివుడు, సభ్యులుగా కొండారెడ్డి, చెన్నయ్య, స్టేట్ కౌన్సిలర్స్‌గా సత్యనారాయణ, గోపాల్‌రాజు, సలహాదారులుగా శ్యామారెడ్డిని రాష్ట్ర కార్యదర్శి కేసీ వెంకటేశ్వర్లు ప్రకటించారు. నూతన కమిటీ జిల్లా ట్రెజరీ అధికారి బి.శ్రీనివాస్‌కు పరిచయం చేశారు. థానాజీ, ఖయ్యూం, శ్రీనివాసులు, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

'రైతులకు క్షమాపణ చెప్పాలి'

హన్వాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ గోదాంలో యూరియా పంపిణీ వద్ద మూర్ఛతో పడిపోయిన రైతును మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆసుపత్రికి తరలిస్తే అది తట్టుకోలేక కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండల నాయకులు మండిపడ్డారు. సోమవారం హన్వాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు కరణాకర్‌గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నరేందర్ మాట్లాడారు. మూర్ఛతో పడిపోయిన వ్యక్తి రైతే కాదని, రిక్షా డ్రైవర్ అని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అతను నవాబ్‌పేట మండలం కార్లపాడ్‌కు చెందిన పిచ్చకుంట్ల ఆంజనేయులు అని అతనికి ఎకర 11 గుంటల భూమి ఉందన్నారు. రైతును రైతు కాదన్నందుకు కాంగ్రెస్ నాయకులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బాలరాజు, కొండ లక్ష్మయ్య, నాయకులు చెన్నయ్య, నాగన్న, శ్రీనువాసులు, జంబులయ్య, యాదయ్య మాధవులుగౌడ్, శ్రీనివాసులు, తిమ్మన్న, రాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులవి చిల్లర ఆరోపణలు : బీఆర్‌ఎస్

మహబూబ్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడినపుడల్లా కాంగ్రెస్ నాయకులు ఆయనపై చిల్లర ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు తాటి గణేష్, నవకాంత్, ఇమ్రాన్ మండిపడ్డారు. మాట్లాడితే శ్రీనివాస్‌గౌడ్ చిట్టా విప్పుతామంటారు.. ఆ చిట్టా ఏంటో విప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యూరియా కేంద్రం వద్ద రైతు ఆంజనేయులు సొమ్మసిల్లి పడిపోతే ఆయనను ఆసుపత్రికి పంపించిన మాజీ మంత్రిపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఆయన రైతు కాదని, రిక్షా కార్మికుడని చెప్పే ప్రయత్నం చేస్తున్నారని, ఆయనపై భూమి ఉందని పాస్‌బుక్కులతో సహా తమ వద్ద ఉన్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు వారి స్థాయిని మరిచి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, వారికి కాలమే సమాధానం చెబుతుందన్నారు.

చేయూత పింఛన్ పెంచి ఇవ్వాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట పింఛన్‌దారులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులతో పాటు చేయూత పింఛన్ పెంచి పంపిణీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయం ముందు వృద్ధులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించి, మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా నేటి వరకు పింఛన్ పెంచలేదని ఆరోపించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలవర్ధన్‌గౌడ్, నర్సిములు, రమేశ్‌జీ, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్, మల్లేష్ యాదవ్, నరేశ్, కాశన్న, రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నవాబ్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ మోసపూరిత వాగ్దాలతో అధికారంలోకి వచ్చిందని, వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. గణేష్ చారి, శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యాదయ్య, రమేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గ్యారెంటీల అమలులో విఫలం

బాలానగర్ : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని బీజేపీ మండల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముందు ధర్నా చేపట్టి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

బీపీ మండల్‌కు నివాళి



బీపీ మండల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల్ కమిషనర్ చైర్మన్ బీపీ మండల్ జయంతి సందర్భంగా సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జడ్చర్లలోని సిగ్నల్‌గడ్డ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజాసంఘాల నాయకులు కృష్ణయాదవ్, బాలవర్ధన్‌గౌడ్, శ్రీనివాసులు, రాములు, జంగయ్య, శేఖర్‌యాదవ్, చంద్రమోహన్, జహంగీర్‌పాషా, రఘుపతిరెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, ఇంతియాజ్ ఖాన్, నిరంజన్, నర్సిములు, శేఖర్ పాల్గొన్నారు.

సీడ్స్ మర్చంట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సీడ్స్ మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని సీడ్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుబ్బ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాగిరి తిరుపతయ్య, ఉపాధ్యక్షుడిగా దామరగిద్ద సంతోష్‌కుమార్, సూది రాము, సహాయ కార్యదర్శులుగా కల్వ సంతోష్‌కుమార్, బంటు వెంకటయ్య, కోశాధికారిగా బాదం వినోద్ కుమార్‌లతో ఏడుగురు నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ధర్మాపురం కుమారస్వామి, కల్వ సురేష్ కుమార్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సీడ్స్ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

ఎవరో వస్తారని..

నవాబ్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందల వాహనాలు తిరుగుతున్న రెండు జిల్లాల సరిహద్దు మధ్య ఉన్న ఈ రహదారిని ఎవరు పట్టించుకోకపోవడం ఓ యువకుడిని కదిలించింది. దీంతో ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఆశపడకుండా తానే గోతిని పూడ్చి ప్రమాదాలు నివారించేందుకు ముందుకొచ్చాడు. వివరాల్లోకి వెళ్తే.. నవాబ్‌పేట నుంచి వికారాబాద్ జిల్లా కుల్కచెర్ల వరకు ఉన్న ఈ రహదారిపై నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో కుల్కచెర్ల నుంచి చౌడాపూర్ మండలం వెంకటాపూర్ సమీపం వరకు డబుల్ రహదారిగా మార్చడంతో ప్రమాదాలు కొంత మేర తగ్గాయి. మిగతా రహదారిని రీ బీటీగా వేయడంతో గోతులు లేకుండా పోయింది. నవాబ్‌పేట నుంచి వికారాబాద్ జిల్లాలోకి ప్రవేశించే నల్లరాళ్ల గడ్డ దగ్గర రోడ్డు గోతులు పడటంతో చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన పలువురు కిందపడి ఆసుపత్రుల పాలయ్యారు. సమస్యను పరిష్కరించాలని రమేష్ పలువురు అధికారులకు విన్నవించినా ఎవరు పట్టించుకోలేదు. పైగా సమస్య పరిష్కారం కాకపోవడం గమనించిన రమేష్ సోమవారం గోతులను మరమ్మతు చేశాడు. దీంతో పలువురు అభినందించారు.



రహదారి మరమ్మతు చేస్తున్న రమేష్

ఇద్దరి బైండోవర్

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేలా ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం ఇద్దరిని జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు ముందు బైండోవర్ చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన ఇద్దరిని బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. నేరాలకు పాల్పడిన, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీ షీట్ ఓపెన్ చేయనున్నట్లు ఆయన హెచ్చరించారు.

తప్పుడు రిపోర్టు ఇచ్చిన డయాగ్నోస్టిక్ నిర్వాహకులు

- ఆందోళనకు గురైన బాధితుడు

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : షుగర్ టెస్ట్ చేయించుకున్న వ్యక్తికి తప్పుడు రిపోర్ట్ ఇవ్వడంతో ఆందోళనకు గురైన సంఘటన సోమవారం జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలోని ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో చోటుచేసుకుంది. జడ్చర్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం ఉదయం షుగర్ టెస్ట్ కోసం వెళ్లాడు. టెస్ట్ నిర్వహించేందుకు నిర్వాహకులు రక్తం సేకరించారు. కాగా టెస్ట్ రిపోర్ట్‌లో 49కి బదులుగా 1649 ఇవ్వడంతో టెస్ట్ చేయించుకున్న వ్యక్తి ఆం దోళనకు గురయ్యాడు. కంప్యూటర్‌లో నమోదు చేసిన సందర్భంలో మిస్టేక్ జరిగిందని నిర్వాహకులు వివరించారు. అనంతరం టెస్ట్ ఒరిజినల్ రిపోర్ట్‌ను అందించారు. కాగా తప్పుడు రిపోర్ట్ ఇవ్వడంతో ఆందోళనకు గురయ్యానని బాధితుడు వాపోయాడు.

కార్గో హమాలీ కార్మికుల కూలి పెంచాలి

పాలమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో కార్గోలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చర్చలు చేపట్టారు. ప్రైవేటు గుత్తేదారు, ఏఐటీయూసీ నాయకులు చేసిన చర్చల్లో 70 శాతం కూలీ రేట్ల పెంపునకు గుత్తేదారు అంగీకరించారి జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ ప్రకటించారు. తెలంగాణ ఆర్టీసీ మహబూబ్‌నగర్ కార్గో లాజిస్టిక్ కేంద్రంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని వారం రోజులుగా చేపట్టిన ఆందోళన సోమవారం పరిష్కామైంది. ఐదు కిలోల బరువు ఉన్న అన్నింటికీ రూ.15లు ఇవ్వాలన్నారు. కూలి రేట్ల పెంపునకు అంగీకరించిన కాంట్రాక్టర్ బాలరాజుయాదవ్‌ను ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో నాయకులు రంగయ్య, శంకరయ్య, లాజిస్టిక్ హమాలీలు అంజి, రాములు, రవి, నరేష్, సతీష్, కృష్ణ, పాష, సుధీర్, గిరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న పరిశ్రమ ప్రతినిధి

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డి గ్రీ కళాశాలలో సోమవారం ఎస్‌ఎస్‌వీ సొల్యూషన్స్ కంపెనీ, కెరీర్ గై డెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. అరబిందో ఫార్మ పరిశ్రమలో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు పరిశ్రమ ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. జాబ్ మేళాలలో వివిధ ప్రాంతాల నుంచి 100 మంది హాజరు కాగా, వీరిలో 44 మందిని ఎంపిక చేశారు. హైదరాబాద్, జడ్చర్ల ఫార్మ కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు, కనీస వేతనంగా రూ.16 వేల నుంచి రూ.19వేల వరకు ఇవ్వనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ స్వరూప్ తెలిపారు. ఎంపిక చేసిన వారికి త్వరలోనే అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వనున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి రాఘ వేందర్‌రెడ్డి, అరబిందో ఫార్మ పరిశ్రమ హెచ్‌ఆర్ హృషికేశ్, ఎస్‌ఎస్‌వీ సొల్యూషన్స్ ప్రతినిధి ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి గొర్రెలు, మేకలకు టీకాల పంపిణీ

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణకు టీకాలు వేసే శిబిరంను మంగళవారం నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఆషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కామేరమ్మపేట, మల్లెబోయిన్‌పల్లి, నాగసాలు, ఆలూరు, వల్లూరు, లింగంపేట, గంగాపురం, బాదేపల్లి గ్రామాల్లో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

దుకాణాలకు రీ టెండర్లు నిర్వహించాలి

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు రీ టెండర్లు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందచేశారు. ప్రైవేట్‌గా ఒక్కో దుకాణానికి రూ.10 వేలు కిరాయి, రూ.2 లక్షల అడ్వాన్స్‌లు ఉన్నాయని వివరించారు. కానీ ఎంపీడీవో కార్యాలయ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు అతి తక్కువ కిరాయితో 20 సంవత్సరాల క్రితం కేటాయించారని పేర్కొన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల ముందు పూలబండి, పాన్‌షాప్‌లతో పాటు ఇతర చిరువ్యాపారం నిర్వహించేందుకు ఒక్కొక్కరితో రోజుకు రూ.100 నుంచి రూ.300 వరకు దుకాణాణ దారులు కిరాయి వసూలు చేస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి మహిళల వాలీబాల్ టోర్నమెంట్



వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జడ్చర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత జ్ఞాపకార్థం రాష్ట్రస్థాయి మహిళల వాలీబాల్ టోర్నమెంట్ సెప్టెంబరు 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు శ్వేత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు కోడ్గల్ యాదయ్య తెలిపారు. సోమవారం జడ్చర్లలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గృహం వద్ద టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. శ్వేతలక్ష్మారెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విజేతకు రూ.60 వేలు, ద్వితీయ రూ.50 వేలు, తృతీయ రూ.40 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బాదేపల్లి పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రాంమోహన్, ప్రణీల్‌చందర్, రఘుపతిరెడ్డి, మురళి, శ్రీశైలంయాదవ్, చైతన్యగౌడ్, వీరేశ్, ఇంతియాజ్‌ఖాన్, సతీష్, దేవ, ఉమాశంకర్‌గౌడ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.